నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
30-06-2025
పేజీలు: 02

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా
# రామచందర్‌రావు

ఈటల, అర్వింద్, లక్ష్మణ్ వంటి సీనియర్లను వెనక్కి నెట్టి పదవి కైవసం
ఆరెస్సెస్, పార్టీలోని సీనియర్ల మద్దతు రామచందర్‌రావుకేనని వెల్లడి
మధ్యాహ్నం 2 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్న కొత్త అధ్యక్షుడు

తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే దానిపై కొద్దిరోజులుగా నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. పలువురు సీనియర్ నేతల పేర్లు ప్రముఖంగా వినిపించినప్పటికీ అధిష్ఠానం అనూహ్యంగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్‌రావును కొత్త అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయన పేరును ఖరారు చేస్తూ, వెంటనే నామినేషన్ దాఖలు చేయాలని పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రామచందర్‌రావు ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు తన నామినేషన్‌ను సమర్పించనున్నారు. రాష్ట్రంలో పార్టీ పగ్గాలను ఎవరికి అప్పగించాలనే అంశంపై బీజేపీ అగ్రనాయకత్వం తీవ్రంగా కసరత్తు చేసింది. ముఖ్యంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ వంటి నేతల పేర్లు అధ్యక్ష పదవి రేసులో బలంగా వినిపించాయి. అయితే, అన్ని సమీకరణాలను బేరీజు వేసుకున్న అధిష్ఠానం చివరికి రామచందర్‌రావు వైపే మొగ్గు చూపింది. ఆయన అభ్యర్థిత్వానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)తో పాటు పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు గట్టిగా మద్దతు తెలిపినట్లు సమాచారం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా ఎదుర్కోవడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి కీలక సవాళ్లను దృష్టిలో ఉంచుకునే కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు నియామకంతో పార్టీలో కొత్త శకం ప్రారంభం కానుందని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ఎంపిక**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను పార్టీ హైకమాండ్ ఎంపిక చేసింది. ఈ నిర్ణయం రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కీలకమని భావిస్తోంది. పీవీఎన్ మాధవ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో సన్నిహిత సంబంధాలు కలిగి, పార్టీలో దీర్ఘకాల అనుభవం ఉన్న నాయకుడిగా పేరొందారు. ఆయన నాయకత్వంలో ఏపీలో బీజేపీ కార్యకర్తల ఐక్యతను, మిత్రపక్షాలతో సమన్వయాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నారు. ఈ నియామకం రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ ప్రభావాన్ని విస్తరించేందుకు, ముఖ్యంగా ఎన్డీఏ కూటమిలో కీలక పాత్ర పోషించేందుకు దోహదపడుతుందని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి.



### తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై
## రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
### నావాడు, నీవాడు అంటే పార్టీకి నష్టమని వ్యాఖ్య



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామకం వ్యవహారంపై ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ రాష్ట్ర సారథిని అధిష్టానం నామినేట్ చేయడం సరికాదని, అంతర్గత ఎన్నికలు నిర్వహించి ఎన్నుకోవాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఇలా నావాళ్లు, నీవాళ్లు అంటూ నియామకాలు చేపడితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా అధిష్టానం ఇప్పటికే ఒక వ్యక్తి పేరును ఖరారు చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోందని రాజాసింగ్ తెలిపారు. ఈ పద్ధతిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. "పార్టీ అధ్యక్షుడిని బూత్ స్థాయి కార్యకర్త నుంచి మొదలుకొని ముఖ్య నేతల వరకు అందరూ ఓటు వేసి ఎన్నుకోవాలి. అలా కాకుండా ఒకరిద్దరు కూర్చొని నిర్ణయాలు తీసుకుంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయి" అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలన్న లక్ష్యం నెరవేరాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం చాలా అవసరమని ఆయన స్పష్టం చేశారు. "నావాడు, నీవాడు అనే ధోరణితో పదవులు ఇచ్చుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం తప్పదు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే అధ్యక్ష పదవికి కచ్చితంగా ఎన్నిక నిర్వహించాలి" అని తేల్చిచెప్పారు. అధ్యక్షుడి నియామకంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ బీజేపీలో కొత్త చర్చకు దారితీశాయి.



## తగ్గుతున్న బంగారం ధరలు

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. కొన్ని రోజుల క్రితంతో పోలిస్తే బంగారం ధరలు కాస్త ఊరటనిస్తున్నాయి.. ఇటీవల లక్ష మార్క్ దాటి పరుగులు పెట్టిన పసిడి ధర వెనక్కి తగ్గుతూ వస్తోంది.. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణగడం.. డిమాండ్ తగ్గడంతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. కొన్ని రోజులక్రితం లక్షా రెండు వేలకు పైగా పెరిగిన తులం బంగారం ధర.. ఇప్పుడు 97 వేలకు తగ్గింది.. అంటే దాదాపు రూ.5వేల వరకు ధర తగ్గింది. అయితే.. భవిష్యత్తులో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు బులియన్ మార్కెట్ నిపుణులు.. అయితే.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. జూన్ 30 2025 సోమవారం ఉదయం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 97,260 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.89,150 గా ఉంది. 10 గ్రాముల బంగారం పై రూ.160 మేర ధర తగ్గింది. వెండి కిలో ధర రూ. 100 తగ్గి.. రూ.1,07,700లుగా ఉంది.



## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

కర్నూల్ జిల్లా నంద్యాల పరిధిలోని శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి ఇన్ ఫ్లో 1,56,554 క్యూసెక్కులుగా ఉంది. ఇక, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 872.50 అడుగులకు చేరుకుంది. అలాగే, పూర్తి స్థాయి నీటి నిల్వ 215.7080 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 152.4941 టీఎంసిలుగా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.



## మెడికోలకు స్టైపెండ్ 15% పెంపు

రాష్ట్రంలో ప్రభు త్వ హాస్పిటళ్లలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మెడికోలకు భారీ గా స్టైపెండ్ పెంచింది. ఒకేసారి 15శాతం పెంచు తూ ఆదివారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెడికల్, డెంటల్ విద్యార్థులతో పాటు, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాన్ని సైతం ప్రభు త్వం పెంచింది. ఈ పెంపుతో ఇంటర్న్‌లకు నెలకు రూ.29,792, పిజి డాక్టర్లకు ప్రథమ సంవత్సరంలో రూ.67,032, ద్వితీయ సంవత్సరంలో రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.74,782 చొప్పన స్టైపెండ్ అందనుంది. సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లకు ప్రథమ సంవత్సరంలో రూ.1,06, 461, రెండో ఏడాదిలో రూ.1,11,785, మూడో ఏడాదిలో రూ.1,17,103 చొప్పన స్టైపెండ్ అందనుంది. అలాగే, సీనియర్ రెసిడెంట్లకు డాక్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.92,575 నుంచి రూ.1,06,461 పెంచుతున్నట్టు ప్రభుత్వం జిఒ లో పేర్కొంది. మెడికోలకు పెరిగిన స్టైఫండ్‌తో దక్షి ణ భారతదేశంలోనే అత్యధిక స్టైఫండ్స్ చెల్లిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు తమ సమ్మెను విరమించారు. ప్రభుత్వంతో వారు జరిపిన చర్చలు సఫలం అయిన నేపథ్యంలో సోమవారం నుంచి తలపెట్టిన సమ్మెను విరమిస్తున్నామని జూడాలు ప్రకటించారు. తమ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని లేదంటే జూన్ 30 నుంచి ధర్నాకు దిగుతామని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ఇటీవల సమ్మె నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ జూడాలను ఆదివారం చర్చలకు ఆహ్వానించారు. చర్చలకు ముందే ప్రభుత్వం మెడికోలకు భారీగా స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. అలాగే కాలేజీల్లో, అనుబంధ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వంతో తమ చర్చలు సఫలం అయ్యాయని జూడాలు పేర్కొన్నారు. మెడికోలకు భారీగా స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జూడాలు మంత్రి దామోదర రాజనరసింహకు కృతజ్ఞతలు తెలిపారు.

## సిగాచి కెమికల్స్‌లో పేలిన రియాక్టర్.. ఆరుగురు కార్మికులు మృతి



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పాశ మైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు సంభవించింది. ఇండస్ట్రియల్ పార్కులోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఒక్కసారిగా రియాక్టర్ పేలిపోయింది. దీంతో ఆరుగురు కార్మికులు మృతిచెందారు. ఘటనా స్థలంలో ఐదుగురు మరణించాగా, దవాఖానలో మరొకరు చనిపోయారు. మరో 15 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం 6 గంటలకు రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు ధాటికి రియాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికులు100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. ప్రొడక్షన్ విభాగం కుప్పకూలింది. మరో భవనానికి బీటలు వారింది. ఉదయం షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. పేలుడు శబ్ధం వినిపించడంతో కార్మికులు బయటకు పరుగులుతీశారు. మంటల్లో చిక్కుకున్న 50 నుంచి 60 మంది కార్మికులను బయటకు తీసుకువచ్చారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను ప్రైవేటు దవాఖానకు తరలించారు. మిగితా కార్మికుల విషయం వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద స్థలాన్ని సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పంకజ్ తదితరులు పరిశీలించారు. సహాయక చర్యల్లో ఫైర్, రెవన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ప్రమాదంతో రసాయన పరిశ్రమ పరిసరాలకు ఘాటైన వాసనలు వ్యాపించాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీలో ఒడిశా, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన కార్మికులు పనిచేస్తున్నారు. విధులకు వెళ్లిన కార్మికులకు వారి కుటుంబ సభ్యులు ఫోన్లు చేస్తున్నారు. అయితే కొందరి ఫోన్లు పనిచేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



## ఇక రెండేళ్లపాటు ఇక్కడే..


పెళ్లి తర్వాత కెరీర్ పరంగా కాస్తంత నెమ్మదించిన అందాలభామ కీర్తి సురేశ్, ఇప్పుడు మళ్లీ స్పీడందుకున్నారు. కోలీవుడ్‌లో రెండు సినిమాలకు సైన్ చేసిన ఈ మహానటి.. టాలీవుడ్‌లోనూ రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. వాటిలో ఒకటి విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన్' కాగా, రెండోది నితిన్ 'ఎల్లమ్మ'. రెండూ దిల్‌రాజు సినిమాలే కావడం విశేషం. కీర్తి సురేష్ 'మహానటి'లో విజయ్ దేవరకొండ 'ఆంటోని' అనే జర్నలిస్ట్‌గా నటించారు. అయితే.. కీర్తి సురేశ్‌తో కాంబినేషన్ సీన్స్ మాత్రం ఆ సినిమాలో ఉండవ్. ఆ విధంగా చూసుకుంటే కీర్తి, విజయ్ కలిసి నటిస్తున్న తొలి సినిమా ఇదే అవుతుంది. రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రాయలసీమ నేపథ్యంలోసాగే యాక్షన్ ఎంటైర్టెనర్ అని సమాచారం. ఇక నితిన్ 'ఎల్లమ్మ' విషయానికొస్తే.. బ్లాక్‌బస్టర్ 'బలగం' తర్వాత వేణు యల్దెండి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా.. ఆధ్యాత్మికత, సంప్రదాయ కళల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. ఈ రెండు సినిమాల కోసం కీర్తి రెండేళ్ల పాటు డేట్స్ ఇచ్చిందట.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING 4PM EDITION

# కిరణ్ అబ్బవరం మూవీ ఫస్ట్ లుక్ విడుదల



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా చిత్రాలు చేస్తున్నారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం K-RAMP. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. యుక్తి తర్జా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ మరియు రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేష్ దండ మరియు శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు.ఈ రోజు చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కిరణ్ అబ్బవరం మాస్ అవతారంలో మెరిసాడు.చేతులతో లుంగీ పట్టుకుని స్టైల్‌గా ముందుకు నడుస్తున్న విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన వెనుక భాగంలో ఫైర్ ఎఫెక్ట్‌లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ బాగుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే కొన్ని వర్గాలు ఈ పోస్టర్ డిజైన్‌ను ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' మూవీ పోస్టర్‌కు పోలికలు ఉన్నాయని అంటున్నారు. ఈ విషయం పై యూనిట్ ఇంకా స్పందించలేదు. ఇక ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.కిరణ్ అబ్బవరం — చేతన్ భరద్వాజ్ కలయికలో ఇది మూడో చిత్రం.




### మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న

## అల్లరి నరేష్.. ఫస్ట్ లుక్ అదుర్స్

టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్స్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్ . అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టిన రోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగిపోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## చార్‌ధామ్ యాత్రపై ఆంక్షలు ఎత్తివేత

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా చార్‌ధామ్ యాత్రను 24 గంటలు నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా పరిస్థితులు మెరుగుపడటంతో 24 గంటల నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. గర్హ్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ఈ మేరకు ప్రకటించారు. 'చార్‌ధామ్ యాత్రపై 24 గంటల నిషేధాన్ని ఎత్తివేశాం' అని ప్రకటించారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే వాహనాలను నిలిపివేయాలని సూచించారు. కాగా, ఉత్తరాఖండ్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ హెచ్చరికలతో చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే.

### పూర్ణచందర్‌పై సంచలన ఆరోపణలు చేసిన స్వేచ్ఛ కూతురు..

## స్పందించిన భార్య స్వప్న



యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. తన కూతురి చావుకి పూర్ణ చందర్ కారణం అంటూ స్వేచ్ఛ తల్లిదండ్రులు ఆరోపించారు. ఆ తర్వాత పూర్ణ చందర్ లేఖ విడుదల చేయగా, ఇందులో స్వేచ్ఛ తన తల్లిదండ్రుల వలన మానసిక ఆవేదన చెంది సూసైడ్ చేసుకుందని ఉంది. ఇక మధ్యలో ఎంట్రీ ఇచ్చిన స్వేచ్ఛ కూతురు నా పైన వేధింపులకి పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేసింది. దాంతో పోక్సో కేసు పెట్టి పూర్ణ చందర్‌ని అరెస్ట్ చేశారు. అయితే పూర్ణ చందర్ మాత్రం తన లేఖలో స్వేచ్ఛ కుమార్తెను తన కన్న కూతురిలా చూసుకున్నానని..స్కూల్లో చేర్పించి ఫీజులు కడుతున్నానని పేర్కొన్నాడు. స్వేచ్ఛ కూతురు ఫంక్షన్ కోసం తాను ఐదు లక్షలు ఖర్చు పెట్టానని కూడా అన్నాడు.. కానీ స్వేచ్ఛ కుమార్తె వర్షెన్ మాత్రం భిన్నంగా ఉంది. పూర్ణచందర్ ప్రవర్తన ఏ మాత్రం బాగా ఉండేది కాదని మీడియాకు చెప్పుకొచ్చింది. ఇక ఇదే సమయంలో పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందని, ముందు వారిద్దరి మధ్య సంబంధం గురించి తనకు తెలియదని, ఎప్పుడైతే వారి వ్యవహారం తెలిసిందో అప్పుడే పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. అయితే పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు చేస్తున్న ఆరోపణలు పూర్తి అసత్యమని, అమెను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న స్పష్టం చేసింది. స్వేచ్ఛ నన్ను మానసికంగా ఎంతో టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని బయపెట్టిందని స్వప్న స్పష్టం చేసింది. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడంటూ స్వప్న కామెంట్ చేయడం గమనర్హం. అయితే స్వేచ్ఛ ఎలాంటి సూసైడ్ నోట్ రాయలేదు. దాంతో పూర్ణచందర్ ను అరెస్టు చేయలేకపోయారు. కానీ అనూహ్యంగా స్వేచ్ఛ కుమార్తె తనపై వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. కుమార్తె ఫిర్యాదుతో పెద్ద చిక్కుల్లోనే పడ్డాడు పూర్ణ చందర్. స్వేచ్ఛ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరిశీలనలో అనుమానాస్పద అంశాలు ఏమైనా బయటపడితే.. అవి సంచలనంగా మారే అవకాశాలు ఉన్నాయి.

### నేటి నుంచి వింబుల్డన్ 2025 ప్రారంభం..

## రికార్డు స్థాయిలో ప్రైజ్ మనీ



ప్రతిష్టాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ 2025 ఈరోజు(జూన్ 30వ తేదీ, సోమవారం) నుండి ప్రారంభం కానుంది. ఈ సంవత్సరం వింబుల్డన్ టోర్నమెంట్ సరికొత్త టెక్నాలజీతో జరగబోతోంది. 147 సంవత్సరాల వింబుల్డన్ చరిత్రలో మొదటిసారిగా మానవ లైన్ జడ్జీలు లేకుండా నిర్వహించనున్నారు. జడ్జీల స్థానంలో 450 కంటే ఎక్కువ ట్రాకింగ్ కెమెరాలతో కూడిన పూర్తిగా ఆటోమేటెడ్ ఎలక్ట్రానిక్ లైన్-కాలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అయితే, లైన్ జడ్జిలు లేకపోవడం, కొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థ దోషరహిత తీర్పు వచ్చే అవకాశం కూడా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇవాళ్టి నుంచి జూలై 13 వరకు ఈ మెగా టోర్నమెంట్ 14 రోజుల పాటు కొనసాగనుంది.

భారీగా ప్రైజ్ మనీ

ఈసారి వింబుల్డన్ ప్రైజ్ మనీని రికార్డు స్థాయిలో రూ.622 కోట్లకు (53.5 మిలియన్ పౌండ్లు) పెంచారు. ఇది, గత సంవత్సరం కంటే దాదాపు రూ.41 కోట్లు ఎక్కువ. మొదటి రౌండ్‌లో ఓడిపోయిన ఆటగాడికి దాదాపు రూ.76.80 లక్షలు (66,000 పౌండ్లు) లభిస్తాయి. ఇది గతసారి కంటే 10శాతం ఎక్కువ. డబుల్స్ విజేతలు రూ.6,80,000 (రూ.7.87 కోట్లు) అందుకుంటారు. అలాగే, మిక్స్‌డ్ డబుల్స్ విజేతలు రూ.1,35,000 (రూ. 1.56 కోట్లు) లభించనుంది.

హ్యాట్రిక్ టైటిల్ కోసం బరిలోకి అల్కరాజ్

రెండుసార్లు డిఫెండింగ్ పురుషుల ఛాంపియన్ అయిన స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్.. హ్యాట్రిక్ టైటిల్ కోసం బరిలోకి దిగుతున్నాడు. వింబుల్డన్ మొదటి రోజు సోమవారం పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఇటలీకి చెందిన ఫాబియో ఫోగ్నినితో అల్కరాజ్ తలపడనున్నాడు. ఇక, మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా తన తొలి రౌండ్ మ్యాచ్‌లో కెనడా క్రీడాకారిణి కార్సన్ బ్రాన్‌స్టెయిన్‌ను ఢీకొనబోతోంది.

### టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టిన లారీ.. ముగ్గురు దుర్మరణం

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున ప్రయాణీకులతో వెళ్తున్న ఓ టెంపో ట్రావెలర్‌ను కురబలకోట మండలం దొమ్మన బావి వద్ద జాతీయరహదారిపై లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టెంపోలో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ప్రమాదం ధాటికి టెంపో ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో అందులో చిక్కుకున్నవారిని వెలికితీసి మదనపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల వివారాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గురైన టెంపో ట్రావెలర్ కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉండటంతో బాధితులంతా ఆ రాష్ట్రానికి చెందినవారై ఉంటారని భావిస్తున్నారు.



# సమంత

## ఇంట్రెస్టింగ్ కామెంట్స్

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలకు కాస్త విరామం ఇచ్చినా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటుంది. తరచూ ఫోటోలు, రీల్స్ షేర్ చేస్తూ అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తోంది. నిన్నటికి నిన్న 'పుల్ అప్స్ చేయకపోతే కామెంట్స్ చేయొద్దు' అంటూ ఓ సెటైరికల్ పోస్ట్‌తో ఆకట్టుకున్న సమంత, తాజాగా తన డేలీ లైఫ్‌లోని విశేషాలను పంచుకుంది. మహానటి ఫేం కీర్తి సురేష్‌తో దిగిన ఫోటోను షేర్ చేస్తూ, "లంచ్‌కి మధ్యాహ్నం కూర్చుంటే, లేచేసరికీ సాయంత్రం అయిపోతుంది" అంటూ ఆ పిక్‌కి క్యాప్షన్ పెట్టింది. కీర్తి సురేష్ సమంతకి జిగిరీ దోస్త్ కాగా, వారు అప్పుడప్పుడు కలుస్తూ ఇలా సందడి చేస్తూనే ఉన్నారు.

